
సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం । 21 । అక్టోబర్ । 2024



వాడపల్లిపై రాజకీయ నీడ

వాడపల్లి వెంకన్న దేవస్థానంలోనూ టీడీపీ నేతలు రాజకీయాలు చేస్తున్నారు.. ఈ క్షేత్రంలోని ఉత్సవాల్లో రాజకీయ చదరంగానికి తెరలేపారు.


8లో



క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలు

క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాస్ కుమార్ అన్నారు. కాకినాడలో జరుగుతున్న రోలర్ స్కేటింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం సాయంత్రం 27,154 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 6,800 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

నేడు యథాతథంగా పీజీఆర్ఎస్



ప్రశాంతి, కలెక్టర్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సోమవారం యథాతథంగా జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. కలెక్టరేట్, రెవెన్యూ డివిజనల్, కార్పొరేషన్, మండలాల స్థాయిలో అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు వ్యయ ప్రయాసల కోర్చి కలెక్టరేట్‌కు రావాల్సిన అవసరం లేదన్నారు.

కోటసత్తెమ్మకు రూ.1.49 లక్షల ఆదాయం

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలోని కోట సత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల విక్రయాల ద్వారా రూ.1,49,820 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.

నేటి నుంచి శత చండీహోమం

తాళ్లపూడి: గ్రామంలోని నవదుర్గ, శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో సోమ, మంగళ, బుధ వారాల్లో మహాకుంభాభిషేకం మహోత్సవాలు, శత చండీయాగం నిర్వహించనున్నారు. సిద్ధేశ్వర కార్తికేయ శివాచార్య గురువుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు అల్లూరి ప్రసాద్ పర్యవేక్షణలో జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. సోమవారం ఆలయ ప్రదక్షిణ, గోపూజ, యాగశాల ప్రవేశం, అంకురార్పణ, మూలమంత్ర హోమాలు జరుగుతాయి. మంగళవారం 108 మంది దంపతులతో శత చండీహోమం, దశమహాదేవి, రాజశ్యామలాప్రత్యంగిర హోమాలు, సాయంత్రం 6 గంటలకు గరికపాటి నరసింహరావు ప్రవచనం ఉంటాయి. బుధవారం అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ఆలయ శిఖరానికి కుంభాభిషేకం, దుర్గామల్లేశ్వరస్వామివారి శాంతికల్యాణం, మధ్యాహ్నం మహాన్నసమారాధన, సాయంత్రం రథయాత్ర నిర్వహిస్తారు.

రేపు రాజానగరంలో జాబ్ మేళా

రాజానగరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నారు. జిల్లా ఉపాధి కల్పనా సంస్థ, నైపుణ్యాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఉపాధి కల్పనా సంస్థ అధికారి హరిశ్చంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాకు మూడు కంపెనీల ప్రతినిధులు హాజరై, అర్హతలు కల వారిని ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, డిప్లమో, ఐటీఐ, బి.ఫార్మసీ, ఎంబీఏ చదివి, 30 ఏళ్ల వయసులోపు వారు అర్హులన్నారు. ఆసక్తి కలవారు ముందుగానే రిజిస్టర్ అవ్వాలని, మంగళవారం ఉదయం 10 గంటల కల్లా అన్ని రకాల డాక్యుమెంట్లతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 83285 07473, 73967 40041 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

రాజబాబు నటన అజరామరం



రాజబాబు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న బాబీ, రాజబాబు మిత్రమండలి సభ్యులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): హాస్యనటుడిగా రాజబాబు అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలిచారని వక్తలు కొనియాడారు. నవ్వుల రారాజు, హాస్యనటుడు రాజబాబు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన సోదరుడు బాబీ ఆధ్వర్యంలో గోదావరి గట్టున ఉన్న రాజబాబు విగ్రహానికి కుటుంబ సభ్యులు, నగర ప్రముఖులు, శ్రేయోభిలాషులు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పేదలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. బాబీ మాట్లాడుతూ రాజబాబు 1960లో సినీ పరిశ్రమలోకి అడుగు పెట్టారని, 590 చిత్రాల్లో నటించి గొప్ప పేరు, ప్రఖ్యాతులు సంపాదించారన్నారు. ఆయన ఎన్నో అవార్డులు అందుకున్నారని, గుప్తదానాలు చేసి చిరస్థాయిగా నిలిచారన్నారు. 47 ఏళ్ల వయసులోనే అందరికీ దూరమయ్యారన్నారు. అగ్ర హీరోలతో కలిసి ఒకే ఏడాదిలో 35 చిత్రాల్లో నటించి రికార్డు సృష్టించారన్నారు. కార్యక్రమంలో రాజబాబు మేనల్లుడు బీఎస్ఎన్ఎల్ వాసు, రాజబాబు మిత్రమండలి మునిని వెంకటేశ్వరరావు (బాబులు), పట్నాయక్, గణేష్, లక్ష్మీనారాయణ (బాబీ), మల్లు రవి, కట్టా చంద్రరావు పాల్గొన్నారు.

ఇసుకాసురులు

- సీఎం చంద్రబాబు ఆదేశాలు బేఖాతరు
- ఇసుక అక్రమ రవాణాకు తెగబడుతున్న కూటమి నేతలు
- అడ్డూ అదుపు లేకుండా తరలింపు
- నిత్యం వందల లారీలతో పక్కదారి
- వినియోగదారులకు అందని వైనం
- ఆన్‌లైన్‌లో ఇసుక నిల్, ఆఫ్‌లైన్‌లోనూ అదే దుస్థితి



గాయత్రి ర్యాంపులో ఇసుక లోడుతో ఉన్న టిప్పర్

సాక్షి, రాజమహేంద్రవరం: 'ఇసుక, మద్యంలో తల దూర్చొద్దు' అంటూ సాక్ష్యాత్తు సీఎం చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేలకు సూచించారు. ఆయన ఆదేశాలను సైతం కూటమి ఎమ్మెల్యేలు, నేతలు బేఖాతరు చేస్తున్నారు. ఆదాయార్జనే ధ్యేయంగా అక్రమాలకు పాల్పడుతున్నారు. మద్యం, ఇసుక అక్రమ రవాణా చేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. ఇంత అడ్డగోలు ప్రక్రియ జరుగుతున్నా అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారే తప్ప చర్యలు తీసుకుంటున్న పాపాన పోలేదు. తూతూమంత్రంగా కేసులు పెట్టడం, మామూళ్లు తీసుకుని మిన్నకుండిపోతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదీ సంగతి

ఇసుక మాఫియా బరితెగిస్తోంది. అధికారం చేతిలో ఉందికదా అని రెచ్చిపోతోంది. అక్రమ రవాణాకు ఆజ్యం పోస్తోంది. ఇసుక కొరతను ఆసరాగా చేసుకుంటోంది. బ్లాక్ మార్కెట్‌కు తరలించి రూ.కోట్లు కొల్లగొడుతోంది. కూటమి ఎమ్మెల్యేలు, నేతల కనుసన్నల్లో వ్యాపారం 'మూడు ట్రాక్టర్లు.. ఆరు లారీలు' అన్న చందంగా సాగుతోంది. అడిగేవారు, అడ్డుకునేవారు లేకపోవడంతో సహజ సంపదను దోపిడీ చేస్తోంది. రాత్రీ, పగలు అన్న తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా నిరాటంకంగా సాగుతోంది. సామాన్యులకు మాత్రం అందడం లేదు.

గాయత్రీ ర్యాంపులో గుల్ల

రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని గాయత్రీ ర్యాంపును ఇసుక తవ్వకాలతో గుల్ల చేస్తున్నారు. ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుల కనుసన్నల్లో ర్యాంపు నడుస్తోంది. అక్కడే తిష్ట వేసి మరీ ఇసుక రవాణా పర్యవేక్షిస్తున్నారు. ప్రతి రోజూ 60 లారీల ఇసుక పక్కదారి పడుతున్నట్లు సమాచారం. ఒక్కో లారీ రూ.30 నుంచి రూ.40 వేలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. తద్వారా రూ.కోట్లల్లో అక్రమాదాయం ఆర్జిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సామాన్యుల అవస్థలు

నిత్యం 20 టన్నుల సామర్థ్యం కలిగిన టిప్పర్లతో ఇసుక తరలుతుంటే సామాన్యులకు మాత్రం ఒక్క ట్రాక్టర్ ఇసుక దక్కడం లేదు. ఆన్‌లైన్‌లో సైతం ర్యాంపులో ఇసుక లేదన్న విషయమే దర్శనమిస్తోంది. ఈ విషయమై ఇటీవల తాపీమేస్త్రిలు, ప్రజలు వాదనకు దిగారు. పదుల సంఖ్యలో టిప్పర్లు తమ కళ్లముందే వెళుతుంటే మాకు మాత్రం ఇసుక స్టాక్ లేదంటున్నారని ఆవేదన చెందారు. స్టాక్ పాయింట్ వద్ద ఎమ్మెల్యే అనుచరులు, అధికారులతో వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. రాజమహేంద్రవరం సిటీ పరిధిలోని కోటిలింగాల పేటలో ఇదే పరిస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా అధికారులు అడ్డుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అనుమతి లేకుండా తవ్వకాలు

విజ్జేశ్వరం వద్ద ఇటీవల కూటమి నేతలు ఇసుక అక్రమ తవ్వకాలకు తెగబడ్డారు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే తవ్వకాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు, అధికారులు తవ్వకాలను అడ్డుకున్నారు. వెంటనే రంగంలోకి దిగిన టీడీపీకి చెందిన ఓ ఎమ్మెల్యే, కీలక నేతలు మావాళ్లే వదిలేయండని అల్టీమేటం జారీ చేయడంతో చేసేది లేక అధికారులు మిన్నకుండిపోయారు. కనీసం పట్టుబడిన ట్రాక్టర్లను సీజ్ చేయడం, వ్యక్తులపై కేసులు పెట్టేందుకు సైతం సాహసించలేదని తెలిసింది.

అక్రమ రవాణా

నిడదవోలు మండలం పందలపర్రు స్టాక్ పాయింట్ రాజమహేంద్రవరానికి చెందిన కూటమి నేతల అక్రమ రవాణాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ప్రతి రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, లారీల్లో ఇసుక ఇతర ప్రాంతాలకు తరలిపోతోంది. అది చూసిన మరికొందరు తమకు కూడా ఇసుక తరలించాలని పట్టుబట్టారు. అక్రమ దందా కాస్తా ముదిరి గొడవకు దారి తీసింది. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో అక్రమ దందాపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ప్రస్తుతం విచారణ చివరి దశకు చేరుకుంది. అక్రమ రవాణాకు సహకరించిన అధికారులపై వేటు పడే అవకాశం ఉన్నట్లు సమాచారం.

గట్టుచప్పుడు కాకుండా..

రాజానగరం నియోజకవర్గంలోని సీతానగరం రీచ్ నుంచి ఇసుక అక్రమంగా తరలుతున్నట్లు తెలిసింది. కూటమి నేతల నేతృత్వంలో దందా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నట్లు తెలిసింది. అధికారులకు తెలిసినా అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



విజ్జేశ్వరం వద్ద ఇసుక తవ్వకాలను అడ్డుకుంటున్న అధికారులు

జిల్లాలో నో స్టాక్

జిల్లా వ్యాప్తంగా 19 ఇసుక ర్యాంపులున్నాయి. మరో 14 ఓపెన్ రీచ్‌లల్లో ఇసుక తవ్వకాలు అనుమతులు ఇచ్చినా తవ్వకాలు ఇంకా ప్రారంభం కాలేదు. వీటి ద్వారా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ఇసుక సరఫరా అవుతోంది. ప్రస్తుతం రాజమహేంద్రవరం, సీతానగరం, కొవ్వూరు, నిడదవోలు, పెరవలి నుంచి ఇసుక రవాణా జరుగుతోంది. కానీ ఇసుక కొరతతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. స్టాక్ పాయింట్లలో మాత్రం ఇసుక గుట్టలు దర్శనమిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుందామంటే నో స్టాక్ అని దర్శనమిస్తోంది. రాజమహేంద్రవరంలోని గాయత్రి, కోటిలింగాల ఘాట్లు అసలు ఆన్‌లైన్‌లోనే కనిపించడం లేదు. అక్రమ రవాణాకు అయితే ఇసుక ఉంటుంది. ప్రజల అవసరాలకు మాత్రం కొరతను చూపిస్తారా అంటూ ప్రజలు మండిపడుతున్నారు.

అధికారుల పర్యవేక్షణేదీ?

తవ్వకాలకు అనుమతులు పొందిన ర్యాంపుల్లో అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి. క్షేత్ర స్థాయిలో అధికారులు ఎక్కడా దర్శనమివ్వడం లేదు. వీఆర్వోలు తప్ప ఉన్నతాధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. దీంతో కూటమి ఎమ్మెల్యేల అనుచరులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సామాన్యులు ర్యాంపుల వద్దకు వెళ్లి ఇసుక విషయమై ఆరా తీస్తుంటే టీడీపీ నేతలు బెదిరింపులకు గురి చేస్తున్నట్లు సమాచారం. 20 టన్నుల స్లిప్పులు తీసుకుని వెళుతున్నా ఇసుక లేదంటూ చెప్పి పంపేస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

యూపీహెచ్‌సీ జిల్లా కమిటీ ఎన్నిక

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక వై.జంక్షన్ సమీపంలోని హెల్త్ సెంటర్‌లో ఆదివారం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల (యూపీహెచ్‌సీ) ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా యూపీహెచ్‌సీ యూనియన్ జిల్లా నాయకులు కేపీ నాయుడు, జేవీవీ సత్యనారాయణ హాజరై ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. జిల్లాల పునర్విభజన జరిగిన నేపథ్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా బి.పవన్, అధ్యక్షులుగా వి.వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా ఎం.అనిత, వి.వెంకట్, కాశి, నరేష్, సహాయ కార్యదర్శులుగా ఎ.అనిల్ కుమార్, ఐ.నూతన, బాల, చంద్రశేఖర్, కోశాధికారిగా జీటీపీ కుమార్ తో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

23 వరకూ దరఖాస్తుకు గడువు

సీటీఆర్ఐ: వేద విద్యను అభ్యసించే యువత నిరుద్యోగ భృతి కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 23వ తేదీ వరకూ గడువు ఉందని దేవదాయశాఖాధికారి కె.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఏపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో వేదవిద్యలో ఉత్తీర్ణత పొంది నిరుద్యోగులుగా ఉన్నవారికి నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు అందిస్తారన్నారు. దీనికి దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 26తో గడువు ముగియగా, మళ్లీ పొడిగించారని తెలిపారు.

కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరవు

మహ్మద్ ఆరిఫ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): చంద్రబాబు నాయకత్వంలోని కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేదని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మహ్మద్ ఆరిఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. జాంపేటలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దారుణంగా క్షీణించాయన్నారు. కర్నూలు జిల్లా అస్పరి మండలంలో ఇంటర్ విద్యార్థినిపై ఓ ప్రేమోన్మాది హత్యకు తెగబడ్డ ఘటన మరువక ముందే కడప జిల్లా బద్వేలు పట్టణంలో మరో విద్యార్థిని ప్రేమోన్మాది కిరాతకానికి బలవ్వడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు, విద్యార్థినులకు రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు.

గత ప్రభుత్వంలో రక్షణ

గత ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దిశ చట్టం అమలు చేసి, దిశ పోలీసు స్టేషన్లు, దిశ యాప్ సృష్టించి మహిళలకు, విద్యార్థినులకు అండగా నిలిచారని ఆరిఫ్ గుర్తు చేశారు. శాంతిభద్రతల విషయంలో రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా నిలిపారని, దిశ యాప్ ద్వారా అనేక సందర్భాల్లో గంటల వ్యవధిలోనే మహిళల ఫిర్యాదులపై స్పందించి వారికి రక్షణ కల్పించారన్నారు. కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడుపుతూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందే తప్ప శాంతి భద్రతలను కాపాడేందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎద్దేవా చేశారు. 31 వేల మంది ఆడపిల్లలు అదృశ్యమయ్యారన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. తన కళ్ల ముందు ఇంత జరుగుతున్నా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర హోం మంత్రి, డీజీపీ తక్షణమే స్పందించి నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. బాలిక కుటుంబానికి రక్షణ కల్పించి వారికి మనోధైర్యాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు ఎస్‌జీఎఫ్ఐ ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో అండర్ -14, 17 విభాగంలో క్రీడాకారుల ఎంపికలు సోమవారం నిర్వహిస్తున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎల్.జార్జి ఆదివారం తెలిపారు. టెన్నిస్ అండర్ 14 బాలబాలికలు, సైక్లింగ్ అండర్-14, 17 బాల బాలికలు, ఉషూ అండర్-17 బాలికల ఎంపికలు జరుగుతాయన్నారు. వివరాలకు 94914 42913ను సంప్రదించాలని కోరారు.

రాజమహేంద్రవరంలో ఉత్సాహంగా పింక్ రన్



రన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్



పింక్ 5 కే రన్‌లో పాల్గొన్న యువత

- రొమ్ము క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన
- జెండా ఊపి ప్రారంభించిన మంత్రి దుర్గేష్ తదితరులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించే 'పింక్ అక్టోబర్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాజమహేంద్రవరంలో పింక్ రన్ నిర్వహించారు. స్థానిక పుష్కర ఘాట్ నుంచి గోదావరి బండ్, స్టేడియం, జాంపేట, కోటగుమ్మం సెంటర్ల మీదుగా తిరిగి పుష్కరఘాట్ వరకూ ఐదు కిలోమీటర్ల మేరరీ కార్యక్రమం జరిగింది. దీనిలో సుమారు 1200 మంది యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

జెండా ఊపి ప్రారంభించిన ప్రముఖులు

ఉదయం 7 గంటలకు ప్రారంభమైన రన్‌లో జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థలకు చెందిన మెడికల్, డెంటల్, ఫిజియో థెరపీ, నర్సింగ్, పారామెడికల్ విద్యార్థులతో పాటు ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్, ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతను దాస్ తదితరులు జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. మూడు దశాబ్దాలుగా జీఎస్ఎల్ క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా గోదావరి ప్రాంత ప్రజలకు వైద్యం అందిస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావు, ఆయన బృందాన్ని మంత్రి దుర్గేష్ అభినందించారు.

విజేతలకు నగదు బహుమతులు

రన్‌లో మొదటి స్థానంలో నిలిచిన చెల్లుబోయిన వెంకట ప్రదీప్‌కు రూ.15 వేలు, రెండో స్థానంలో నిలిచిన కిలపర్తి భాస్కర్‌కు రూ.10 వేలు, మూడో స్థానంలో నిలిచిన ముదిలి శరత్‌చంద్ర ప్రసాద్‌కు రూ.5 వేల చెక్కులను రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అందజేశారు.

నివారణ సాధ్యమే

జీఎస్ఎల్ స్వతంత్ర నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ గీత మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే, నివారించే అవకాశాలు 95 శాతం ఉంటాయని తెలిపారు. జీఎస్ఎల్ సంస్థల ఫౌండర్, చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ఎంత ముందుగా గుర్తిస్తే అంత సురక్షితంగా రోగులు కోలుకునే అవకాశం ఉందన్నారు. జీఎస్ఎల్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్, సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ తరుణ్ గోగినేని మాట్లాడుతూ రౌండ్ టేబుల్ ఇండియా, ఓఎన్‌జీసీ, గెయిల్, ఆర్బోస్, హాబిటేట్, తూగో రుచులు, రిలయన్స్, హెటిరో హెల్త్ కేర్ సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

కిక్కిరిసిన రత్నగిరి

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవాలయం ఆదివారం వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. భక్తులంతా సత్యదేవుని వ్రతమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో సత్యదేవుని ఆలయం, ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, విశ్రాంతి మండపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో సప్త గోవులకు ప్రదక్షిణ చేసి శ్రీకృష్ణునికి పూజలు చేశారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించగా స్వామివారి వ్రతాలు రెండు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో నాలుగు వేల మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు.

కన్నుల పండువగా సత్యదేవుని రథోత్సవం

సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి రథోత్సవం ఆదివారం స్వామివారి ఆలయ ప్రాకారంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు రథాన్ని తూర్పు రాజగోపురం ముందుకు తీసుకు వచ్చారు. అనంతరం మేళతాళాల మధ్య ఆ రథంపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల విగ్రహాలను పండితులు ప్రతిష్ఠించారు. స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకుడు సుధీర్ పూజలు చేశారు. అనంతరం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహన్‌రావు కొబ్బరికాయ కొట్టి రథోత్సవం ప్రారంభించారు.

లోవకు భక్తుల తాకిడి

– రూ.3.27 లక్షల ఆదాయం

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో రద్దీ నెలకొంది. ఆదివారం వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన ఏడువేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,11,000, పూజా టికెట్లకు రూ.75,480, కేశఖండనశాలకు రూ.9,920, వాహన పూజలకు రూ.రెండు వేలు, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు రూ.73 వేలు, విరాళాలు రూ.56,513 వెరసి రూ.3,27,913 ఆదాయం సమకూరినట్టు ఈఓ తెలిపారు. మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం కురవడంతో ప్రాంగణంలో వంటలు, భోజనాలు చేసే భక్తులు ఇబ్బందులకు గురయ్యారు.



విశేష అలంకరణలో తలుపులమ్మవారు



లోవ ప్రాంగణంలో భక్తుల రద్దీ

పొగాకు రైతులకు లాభాల పంట

- రాష్ట్రంలో 215 మిలియన్ల కిలోల కొనుగోలు
- కిలో సగటు ధర రూ.288.65
- బోర్డు లక్ష్యాన్ని అధిగమించిన ఉత్పత్తి
- ముగిసిన పొగాకు కొనుగోళ్లు



దేవరపల్లి వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు వేలం (ఫైల్)

దేవరపల్లి: రాష్ట్రంలోని 16 వేలం కేంద్రాలలో 2023–24 సంవత్సరం పంట కాలానికి పొగాకు కొనుగోళ్లు ముగిశాయి. పొగాకు వేలం ప్రక్రియ ఈ నెల 14వ తేదీతో ముగిసినట్టు బోర్డు అధికారులు తెలిపారు. ఎస్‌బీఎస్ ప్రాంతంలోని ఒంగోలు, టంగుటూరు, కొండేపి, వెల్లంపల్లి, ఎస్ఎల్ఎస్ ప్రాంతంలోని పొదిలి, కందుకూరు, కలిగిరి, డీసీ పల్లి, కనిగిరి, ఎన్ఎల్ఎస్ ప్రాంతంలోని దేవరపల్లి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, గోపాలపురం వేలం కేంద్రాల ప్రాంతాల్లో పొగాకు సాగు జరుగుతోంది.

ఎస్‌బీఎస్ ప్రాంతంలో..

ఎస్‌బీఎస్ ప్రాంతంలోని ఐదు వేలం కేంద్రాల పరిధిలో 46.62 మిలియన్ల కిలోల ఉత్పత్తి లక్ష్యం కాగా, 74.86 మిలియన్ల కిలోలు అవుతుందని బోర్డు అధికారులు అంచనా వేయగా, 79.13 మిలియన్ల కిలోల ఉత్పత్తి జరిగింది. రైతులకు కిలో సగటు ధర రూ. 276.02 లభించింది.

ఎస్ఎల్ఎస్ ఏరియాలో..

ఎస్ఎల్ఎస్ ప్రాంతంలోని ఆరు వేలం కేంద్రాల పరిధిలో 43.36 మిలియన్ల కిలోల ఉత్పత్తి లక్ష్యం కాగా, 64.14 మిలియన్ల కిలోలు ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. అయితే 68.96 మిలియన్ల కిలోలు ఉత్పత్తి జరిగింది. కిలో సగటు ధర రూ. 268.37 లభించింది.

ఎన్ఎల్ఎస్‌లో..

ఎన్ఎల్ఎస్ ప్రాంతంలోని ఐదు వేలం కేంద్రాల పరిధిలో 52.02 మిలియన్ల కిలోల ఉత్పత్తి లక్ష్యం కాగా, 66.50 మిలియన్ల కిలోల ఉత్పత్తి అవుతుందని అధికారుల అంచనా వేశారు. ఇక్కడ 67.26 మిలియన్ల కిలోల ఉత్పత్తి జరగగా, కిలో సగటు ధర రూ. 324.31 లభించింది. రాష్ట్రంలోని 16 వేలం కేంద్రాల్లో ఎన్ఎల్ఎస్ ప్రాంతంలో అత్యధిక కిలో సగటు ధర పలికింది. రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని గోపాలపురం వేలం కేంద్రంలో అత్యధిక సగటు ధర రూ.328.83 రైతులకు లభించింది.

విదేశాల్లో తగ్గిన ఉత్పత్తి

జింబాబ్వే, బ్రెజిల్ దేశాల్లో గత ఏడాది పొగాకు పంట దెబ్బతినడంతో దాదాపు 200 మిలియన్ల కిలోల ఉత్పత్తి తగ్గింది. దీనివల్ల మన రాష్ట్రంలో పండించిన పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ ఏర్పడింది. తద్వారా రైతులకు మంచి ధర లభించింది. దీనిని దృష్టిలో పెట్టుకుని 2024–25 సీజన్‌లో సాగు విస్తీర్ణం పెంచి, ఉత్పత్తి పెరిగితే రైతులు నష్టపోతారని బోర్డు అధికారులు హెచ్చరిస్తున్నారు. 2024–25 సీజన్‌లో జింబాబ్వే, బ్రెజిల్, ఇండోనేషియా దేశాల్లో పొగాకు ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని తెలిపారు.

215 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు

రాష్ట్రంలోని 16 వేలం కేంద్రాల్లో రూ.6,192 కోట్ల విలువ గల 215 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగినట్టు బోర్డు అధికారులు తెలిపారు. 142 మిలియన్ల కిలోల ఉత్పత్తి బోర్డు లక్ష్యం కాగా, 205 మిలియన్ల కిలోలు ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేశారు. అయితే 215.35 మిలియన్ల కిలోలు ఉత్పత్తి జరిగినట్టు అధికారుల గణాంకాలు చెపుతున్నాయి. కిలో సగటు ధర రూ.288.65 పలికింది.

క్లుప్తంగా

హైఓల్టేజీతో రూ. 8 లక్షల ఆస్తినష్టం


ఒక ఇంట్లో కాలిపోయిన ఫ్రిజ్

రాజానగరం: స్థానిక వైఎస్సార్ జంక్షన్ ఏరియాలో విద్యుత్ హైఓల్టేజ్ కారణంగా సుమారు 12 ఇళ్లలోని విద్యుత్ పరికరాలు దెబ్బతిన్నాయి. ఈ కారణంగా సుమారు రూ. ఎనిమిది లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని సంబంధిత వ్యక్తులు మండా సత్తిబాబు, కోకా దేవి, రాయుడు విజయ, నీలపాల వీర్రాజు తదితరులు గగ్గోలు పెడుతున్నారు. హైఓల్టేజ్ కారణంగా ఆయా ఇళ్లలోని టీవీలు, ఫ్రిజ్లు, ఏసీలు, ఫ్యాన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు పాడయ్యాయి. ఈ విషయమై స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ సుధాకర్‌ని వివరణ కోరగా హైఓల్టేజ్ వచ్చిన మాట వాస్తవమేనన్నారు. ఐదారు ఇళ్లలోని విద్యుత్ పరికరాలు దెబ్బతిన్నాయన్నారు. ఆ ప్రాంతంలో ఎర్త్‌వైర్ సరిగా లేకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమైందని, వెంటనే శాఖాపరంగా సమస్యను సరిచేశామన్నారు.

బంగారు ఆభరణాల చోరీ

సీతానగరం: సీతానగరం పంచాయతీ పరిధి దేవాంగుల వీధిలో గుత్తి ఝాన్సీలక్ష్మి ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ నెల 15న ఝాన్సీలక్ష్మి పాలకొల్లులో బంధువుల ఇంటికి వెళ్లి, తిరిగి 19న సీతానగరంలోని ఇంటికి చేరుకున్నారు. అయితే బీరువాలో ఉంచిన ఆరు తులాల బంగారు ఆభరణాలు కనిపించకోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రైఫిల్ షూటింగ్ క్రీడాకారుల ఇక్కట్లు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరు రోడ్‌లోని రాజమహేంద్రవరం ఇంటర్‌నేషల్ స్కూల్‌లో శనివారం ఎస్‌జీఎఫ్‌ఐ 68వ రైఫిల్ షూటింగ్ పోటీలు ఆలస్యంగా ప్రారంభం కావడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో జట్లు పాల్గొన్నాయి. షెడ్యూల్ ప్రకారం ఓపెన్ సైట్ విభాగంలో అండర్-14, 17, 19 పోటీలు శనివారం జరగాల్సి ఉండగా నిర్వాహకులు అండర్-19 విభాగంలో బాలురు, బాలికల పోటీలు ముందుగా ప్రారంభించి, అండర్-17, 14 ఆలస్యంగా నిర్వహించడంతో రాత్రి 10.30 వరకు క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక దశలో షెడ్యూల్ ముందుగా ప్రకటించక పోవడంతో తమ పిల్లల షెడ్యూల్ వస్తుందో రాదో తెలియక తల్లిదండ్రులు నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. అండర్-14 విభాగంలో రాత్రి పోటీలు నిర్వహించడంతో కొందరు క్రీడాకారులు నిద్రావస్థలోనే పోటీలలో పాల్గొన్నారు. పోటీల వేదిక రాజమహేంద్రవరానికి దూరం కావడం, రాత్రి సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయని, వచ్చే ఏడాది వేదికను మార్చాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై టోర్నమెంట్ పరిశీలకుడు రాఘవ మాట్లాడుతూ క్రీడాకారులు ఆలస్యంగా రిపోర్టు చేయడం, పోటీలు పారదర్శకంగా నిర్వహించడం వల్ల ఈ ఇబ్బందులు తలెత్తాయన్నారు.

వాడపల్లిపై రాజకీయ నీడ


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి

- నేటి నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు
- కేవలం టీడీపీ నేతలకే ఆహ్వానం
- ప్రతిపక్ష వైఎస్సార్ సీపీకి దక్కని పిలుపు
- దేవస్థానంలో అధికార రాజకీయ చదరంగం

ఆత్రేయపురం: ఏడు వారాల స్వామి వాడపల్లి వెంకన్న దేవస్థానంలోనూ టీడీపీ నేతలు రాజకీయాలు చేస్తున్నారు.. దినదిన ప్రవర్ధమానంగా వెలుగొందుతున్న ఈ క్షేత్రంలోని ఉత్సవాల్లో రాజకీయ చదరంగానికి తెరలేపారు.. ప్రొటోకాల్‌ను ఎక్కడా పాటించకుండా వివక్ష చూపుతున్నారు. చివరికి చినికి చినికి గాలివాన అయ్యేలా మార్చుతున్నారు. దేవుని సన్నిధిలోనూ ఇలాంటి రాజకీయాలు చేయడం సరి కాదని అంతా దుయ్యబడుతున్నారు.

కోనసీమ తిరుపతిగా వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి క్షేత్రం ఖ్యాతికెక్కింది. ఏటా ఇక్కడ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతుంటాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో మొదటి సారిగా జరుగుతున్న ఈ బ్రహ్మోత్సవాలపై రాజకీయ నీడ అలముకుంది. గతంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా సరే స్థానిక ఎమ్మెల్యేతో పాటు ఇతర ప్రజాప్రతినిధులను దేవస్థానం అధికారులు ఆహ్వానించేవారు. కాగా సోమవారం నుంచి ప్రారంభం కానున్న స్వామివారి బ్రహ్మోత్సవాలకు ఈ సారి మాత్రం కేవలం అధికార పార్టీ నేతలకే ఆహ్వానం అందింది. అంటే టీడీపీ నేతలకు మాత్రమే దేవస్థానం అధికారులు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఆత్రేయపురం మండలం ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబాతో పాటు పలువురు వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులకు ఎలాంటి ఆహ్వానం అందలేదు. టీడీపీ నేతలకు మాత్రమే అధికారులు దగ్గరుండి మరీ ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఎలాంటి హోదా లేకపోయినా కేవలం అధికార పార్టీ నేతలనే సాకుతో వారిని ఆహ్వానించిన దేవస్థానం అధికారులు ప్రొటోకాల్ ప్రకారం ఎంపీపీ, జెడ్పీటీసీలను పిలవకపోవడం చర్చనీయాంశమైంది. వాడపల్లి వేంకటేశ్వర స్వామి సన్నిధిలోనూ రాజకీయ చదరంగం ప్రారంభించారంటూ అంతా గుసగుసలాడుతున్నారు. రాజకీయాలు కేవలం ఆయా నేతల మధ్యే ఉండాలే కానీ.. ఇలా అందరికీ ప్రియమైన కలియుగ దైవం శ్రీవారి సన్నిధిలో చేయడం సరికాదని వైఎస్సార్ సీపీ నేతలు మండిపడుతున్నారు. వాడపల్లి స్వామి సన్నిధిలో వైభవంగా జరగనున్న బ్రహ్మోత్సవాలకు ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులనూ పిలవకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాక్షాత్తూ స్వామివారి సన్నిధిలో అధికారులు సైతం టీడీపీ నాయకుల్లా వ్యవహరించడం మంచి పద్ధతి కాదంటూ విమర్శిస్తున్నారు.


ముస్తాబైన వాడపల్లి ఆలయం

చెప్పారో లేదో తెలుసుకుంటా..



వాడపల్లి వెంకన్న క్షేత్రంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆహ్వాన పత్రికలు అందించే విషయాన్ని సిబ్బందికి తెలిపాం. అలాగే ఎంపీపీ, జెడ్పీటీసీలకు ఇవ్వాలని సూచించాం. వారు చెప్పారో లేదో తెలుసుకుంటాం. అసలేం జరిగిందో ఆరా తీస్తాం.
– నల్లం సూర్యచక్రధరరావు, వాడపల్లి ఆలయ ఈఓ

నేటి నుంచి ఉత్సవాలు

వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి 29 వరకూ అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా 21న ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరుణ, దీక్షాధారణ, విశేషార్చన, నీరాజనం, సాయంత్రం వాస్తు హోమం, ధ్వజ పతాక హోమాలు, శేషవాహన సేవ, 22న పంచామృత మండప ఆరాధన, మహా సుదర్శన హోమం, సాయంత్రం ప్రధాన హోమాలు, స్వామివారికి విశేష అర్చన, సరస్వతీ అలంకరణలో హంస వాహన సేవ, 23న సంకల్పం, సప్త కలశారాధన, వసంతోత్సవం, పాద పద్మారాధన, ప్రధాన హోమాలు, సాయంత్రం ప్రధాన హోమాలు, హనుమత్ మూలమంత్ర పూజలు, కోదండరామ అలంకరణతో హనుమత్ వాహన సేవ, 24న సుప్రభాత సేవ, నవనీత హారతి, శత కలశాభిషేకం, లక్షతులసి పూజ, ప్రధాన హోమాలు, సాయంత్రం బ్రహ్మోత్సవ సంబంధిత ప్రధాన హోమాలు, యోగనరసింహ అలంకరణలో సింహవాహన సేవ, 25న పంచామృత మండపారాధన, సాయంత్రం ప్రధాన హోమాలు, బలిహరణ, మలయప్ప అలంకరణతో గరుడ వాహన సేవ, 26న అష్టకలశారాధన, శోభయాత్రగా గోదావరి నదీ జలసంగ్రహణ, స్వామివారి నదీ జలాభిషేకం, మహిళలచే సామూహిక లక్ష కుంకుమార్చన, శ్రీకృష్ణ అలంకరణతో సూర్యప్రభ వాహన సేవ, సాయంత్రం చంద్రప్రభ వాహన సేవ, 27న సప్తకలశారాధన, అభిషేకాలు, ప్రధాన హోమాలు, మహా పుష్పయాగం, సాయంత్రం గజవాహన సేవ, 28న పంచామృత మండపారాధన, నీరాజనం, కల్పవృక్ష సేవ, సాయంత్రం కల్కి అలంకరణలో అశ్వవాహన సేవ, 29న మహాశాంతి హోమాలు, ధ్వజారోహణ నీరాజనం, సాయంత్రం వివిధ పూజలతో బ్రహ్మోత్సవాలు ముగిస్తాయి. బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో అర్చకులు, ఇతర పండితుల ఆధ్వర్యంలో పూజలు జరుగుతాయి.

శబరిగిరీశుని దర్శనానికి వెళ్దామా..




మాలధరించిన అయ్యప్ప భక్తులు

- అందివచ్చిన ఆన్‌లైన్ అవకాశం
- నెట్‌లో టిక్కెట్ల బుకింగ్‌తో మేలు

రాయవరం: వచ్చే నెల 1వ తేదీ నుంచి కార్తికమాసం ప్రారంభం కానుంది. అయితే పలువురు విజయదశమి రోజు నుంచి అయ్యప్ప మాలధారణ ప్రారంభించారు. మరికొందరు భక్తులు విజయదశమికి ముందు నుంచే మాల ధరించారు. హరిహర సుతుడైన అయ్యప్పస్వామి మాలధరించిన భక్తులు నియమ నిష్టలతో మండల దీక్ష (41 రోజులు) చేపడతారు. మండల దీక్ష అనంతరం శిరస్సున ఇరుముడి దాల్చి శబరిగిరీశున్ని దర్శించుకునేందుకు తరలి వెళ్తుంటారు. కరిమల వాసుని దర్శించుకునే భక్తులకు ట్రావెన్‌కూర్ దేవస్థానం ఇంటర్నెట్ ద్వారా దర్శనం టిక్కెట్లు బుక్ చేసుకునే వీలు కల్పించింది.

ఇబ్బందులు తొలగించేందుకు..

ఏటా ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు లక్షకు పైగా భక్తులు శబరిమలకు వెళ్తుంటారు. మాల ధరించిన స్వాములతో పాటు మరికొందరు స్వామి దర్శనానికి బారులు తీరుతుంటారు. దాంతో అక్కడ రద్దీతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అందుకే కేరళ ప్రభుత్వం ఇంటర్నెట్‌లో టిక్కెట్ బుకింగ్‌ను ప్రవేశపెట్టింది. అందులో టిక్కెట్ నమోదు చేసుకోవడం ద్వారా వారు సూచించిన సమయానికి దర్శనం సులువయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతో సమయం ఆదా కావడం, వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ప్రయాణం సులువుగా ముగించుకుని తిరుగు ప్రయాణం కావచ్చు.

ఇలా బుక్ చేసుకోవచ్చు

కంప్యూటర్ ఉండి, ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న వారు ముందుగా గూగుల్ పోర్టల్‌ను తెరవాలి. అందులో **www.sabarimalaonline.org** అని టైప్ చేయాలి. ఈ-మెయిల్ ద్వారా లాగిన్ కాగానే అక్కడ ట్రావెన్‌కూర్ దేవస్థానం ఆన్‌లైన్ సర్వీసెస్ కనిపిస్తుంది. విరుట్యువల్ లాగిన్ ద్వారా ఎంటర్ అవ్వాలి. అక్కడ ప్రస్తుతం అక్టోబర్, నవంబర్, డిసెంబర్, జనవరి మాసాలు పొందుపర్చబడి ఉంటాయి. భక్తులు ఏ నెలలో అయ్యప్ప దర్శనానికి వెళ్లాలనుకుంటున్నారో అక్కడ నమోదు చేసి సెర్చ్‌పై క్లిక్ చేయాలి. ఆ నెలలో తేదీలు కనిపిస్తాయి. తెలుపు రంగులో ఉంటే ఆ రోజు బుకింగ్ లేదని అర్థం. ముదురు ఆకుపచ్చ రంగులో ఉంటే ఖాళీలు ఉన్నట్లు అర్థం. పక్కనే టిక్కెట్ల ఎవైలబిలిటీ, దర్శన వేళలు సైతం ఉంటాయి. తేదీ బుక్ చేయగానే పిల్‌గ్రిమ్ వివరాలు అడుగుతుంది. అందులో దర్శనానికి వెళుతున్న వ్యక్తి పేరు, వయసు, చిరునామా, రాష్ట్రం, సెల్‌ఫోన్ నంబరు తదితరాలు, చిరునామాకు సంబంధించి ఆధార్ లేదా రేషన్ కార్డు లేదా ఓటరు గుర్తింపు కార్డు వివరాల నమోదుతో పాటు ఫొటో, ఏదో ఒక గుర్తింపు కార్డు నకలు అప్‌లోడ్ చేయాలి. అనంతరం దానిని ప్రింట్ తీసుకోవచ్చు. దర్శనానికి వెళ్తున్నప్పుడు ఆ కాగితంతో పాటు మనం అప్‌లోడ్ చేసిన గుర్తింపు కార్డును వెంట తీసుకెళ్లాలి. తద్వారా ముందుగా నమోదు చేసుకున్న వేళల్లో సులువుగా అయ్యప్పను దర్శించుకునే అవకాశం ఉంటుంది. ఎక్కువ మంది భక్తులు తమ ఆధార్ కార్డునే నమోదు చేసుకుంటున్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలు


జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొనే జట్టుతో హరీష్, జార్జి తదితరులు


స్కేటింగ్ పోటీల్లో విజేతలకు మెడల్స్ అందజేస్తున్న డీఎస్‌డీవో శ్రీనివాస్ కుమార్

- జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాస్ కుమార్
- ముగిసిన రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కాకినాడలోని మున్సిపల్ స్కేటింగ్ రింక్‌లో ఈ నెల 18 నుంచి జరుగుతున్న 68వ అంతర్ జిల్లాల రోలర్ స్కేటింగ్ పోటీలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. పోటీల ముగింపునకు ముఖ్య అతిథిగా డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్, గౌరవ అతిథిగా టి.హరీష్ హాజరయ్యారు. దీనికి జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి ఎల్.జార్జి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో అండర్-11, 14, 17, 19 విభాగాల్లో రింక్-1, 2, రోడ్-1, 2 విభాగాల్లో 350 మంది క్రీడాకారులు 13 జిల్లాల నుంచి హాజరయ్యారన్నారు. వీరితో పాటు 100 మంది టెక్నికల్, అఫీషియల్స్ పాల్గొన్నారని తెలిపారు. క్రీడాకారులకు టీ షర్ట్సు అందించిన హరీష్ స్పోర్ట్స్ నిర్వాహకులు టి.హరీష్‌కు, పోటీలను విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన కలెక్టర్ షణ్మోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, ఎస్‌జీఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తిరాజు, సంయుక్త కార్యదర్శి రాధాకృష్ణ, జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి, ట్రెజరర్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన 48 మంది క్రీడాకారులను, 8 మందిని కోచ్, మేనేజర్లుగా నవంబర్‌లో ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. పోటీలకు ఎస్‌జీఎఫ్‌ఐ పరిశీలకునిగా దిలీప్ వ్యవహరించారు. డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి ఆయా జిల్లాలకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టును జార్జి ప్రకటించారు. టోర్నమెంట్ పరిశీలకులు దిలీప్, ఎస్‌జీఎఫ్‌ఐ సంయుక్త కార్యదర్శులు సునీల్, పరశురాం, బి.సురేష్ రాజు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు వి.రవిరాజు, కార్యదర్శి నూకరాజు, కోశాధికారి రవి సుందర్ కొర్, స్కేటింగ్ అసోసియేషన్ కోశాధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు ఇవే..

క్వాడ్ అండర్-11 బాలురు, బాలికల విభాగంలో మోస అని సుసాన్ (తూర్పు), విరోతి రిషీశ్వర్ (తూర్పు), అండర్-14 విభాగంలో నికిల్ ఈశ్వర్ (తూర్పు), కె.కుమార్ చందు శ్రీధర్ (తూర్పు), అండర్-17 విభాగంలో వీవీ వీరవర్షిణి (తూర్పు) ఎంపికైన వారిలో ఉన్నారు. ఇన్‌లైన్ విభాగం అండర్-11లో ఎస్.శ్యాం సుందర్ రెడ్డి (తూర్పు), అండర్-14లో భవ్యశ్రీ (తూర్పు), మహీధర్ రాజ్‌కుమార్ (తూర్పు), ఆర్.అఖిల్ రుషివర్మ (తూర్పు), అండర్-17లో అనిఫా మెహనాజ్ (తూర్పు), అండర్-19లో డి.చరిష్ హైమసత్య (తూర్పు) ఎంపికయ్యారు.

విద్యుత్తే యమపాశమై..

- షాక్‌తో తల్లీ కుమారుల మృతి
- రోజు వ్యవధిలో ఘటన


తల్లి పద్మతో నాని (ఫైల్)

సామర్లకోట: ఒకే కుటుంబంలో అంతులేని విషాదం చోటుచేసుకుంది. రోజు వ్యవధిలో ఇంటి ఇల్లాలితో పాటు అందివచ్చిన కుమారుడే మృతి చెందడం తీరని ఆవేదనను మిగిల్చింది. కరెంట్ షాక్‌తో ఇల్లాలు మృతిచెందగా అంతా గుండెపోటు అనుకున్నారు. మళ్లీ అదే ప్రాంతంలో షాక్‌కు గురై కుమారుడు మృతి చెందడంతో అంతా లబోదిబోమంటున్నారు. ముందే విద్యుత్తు షాక్ గురించి తెలిసి ఉంటే ఇంత దారుణం జరిగి ఉండేది కాదని ఆవేదన చెందుతున్నారు. ఆ హృదయ విదారక ఘటన కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వీర్రాఘవపురంలో జరిగింది. వీర్రాఘవపురానికి చెందిన చిట్టుమాని పద్మ(43) ఇంటి బయట కుళాయి వద్ద దుస్తులు ఉతికి వాటిని గోడపై ఆరబెడుతుండగా విద్యుత్తు షాక్‌తో పడిపోయి శనివారం మృతి చెందింది. బీపీ లేకుంటే గుండెపోటు అనుకుని దహన సంస్కారాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం మృతురాలి కుమారుడు చిట్టుమాని విశ్వేస్ (నాని)(23) టిఫిన్ చేశాక ఖాళీ ప్లేట్ కుళాయి పక్కన పెట్టి చేతులు శుభ్రం చేసుకొంటున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఆసుపత్రికి తరలించే సమయంలో చనిపోయాడు.

నా ఇంటి వెలుగు ఆరిపోయింది

ఇంటికి వెలుగునిచ్చే విద్యుత్తు నా ఇంటి వెలుగు భార్యను, అందివచ్చిన కొడుకును ఆర్పేసిందని నాని తండ్రి చిట్టుమాని కామరాజు బోరున విలపించాడు. భార్య పద్మ, కుమారుడు నాని మృతితో కామరాజు గుండెలు బాదుకొంటూ రోదించాడు. కుమారుడికి పెళ్లి చేద్దాం అనుకొంటున్న తరుణంలో తన చేతులతోనే తలకొరివి పెట్టాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇటీవల గణపతి నవరాత్రుల ఊరేగింపు సమయంలో ఇంట్లోకి వచ్చే విద్యుత్ వైర్‌కు సంబంధించిన ఎర్త్ వైర్ తెగిపోవడంతో సమీపంలో కుళాయి వద్ద ఉన్న మొక్కకు చుట్టారు. దుస్తులు ఉతికిన సమయంలో తడికి ఎర్త్ ఎక్కువగా రావడంతో పద్మ, అదే ప్రదేశంలో కుమారుడు నాని మృతి చెందాడని కామరాజు విలపిస్తూ చెప్పాడు. ఇద్దరు కుమార్తెలకు పెళ్లి చేసేశాను.. ఉన్న ఒక్క కుమారుడిని కోల్పోవడంతో తాను ఎవరి కోసం జీవించాలని విలపించిన తీరు స్థానికుల హృదయాలను కదిలించింది. తోటి కోడలు పద్మ, వరసకు కుమారుడైన నాని మృతి చెందడంతో ఆ వార్డు కౌన్సిలర్ చిట్టుమాని రాఘవ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరావులు కామరాజును, అతని కుమార్తెలను ఓదార్చారు. సీఐ ఎ.భగవాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన స్వర ప్రభంజనం


కోరుకొండ ప్రభ స్వర ప్రభంజనం ప్రారంభోత్సవంలో పాట పాడుతున్న గాయని ప్రభ, చిత్రంలో నగర ప్రముఖులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్వర ప్రభంజనం వీనులవిందుగా సాగింది. వర్ధమాన గాయని కోరుకొండ ప్రభ 116 పాటలతో నిర్వహించిన స్వర ప్రభంజనం కార్యక్రమం సినీ సంగీత అభిమానులను మైమరపించింది. సోగ్గాడు శ్రీశోభన్ బాబు కల్చరల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ రాజమహేంద్రవరం వేంకటేశ్వర ఆనంకళా కేంద్రంలో కోరుకొండ ప్రభ స్వర ప్రభంజనం పేరుతో నిర్వహించిన సంగీత విభావరి ఆహూతులను అలరించింది. గతంలో 50 పాటలు పాడి అర్ధశత గానప్రభ, 75 సినీ గీతాలు పాడి వజ్రామృత గానప్రభ బిరుదు పొందిన కోరుకొండ ప్రభ తాజాగా ఇప్పుడు నిర్వహించిన సంగీత విభావరితో రికార్డులకు ఎక్కిందని నిర్వాహకుడు, సంస్థ అధ్యక్షుడు దొండపాటి సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో గాయనీ గాయకులు షేక్ మదరషా అలీ, మల్లాది రాజేశ్వరరావు, బీహెచ్ రామకృష్ణ, బోడపాటి శ్రీనివాస్, తదితరులు తమ గాత్ర మాధుర్యాన్ని పంచారు. భారత్ వికాస్ పరిషత్ పూర్వ అధ్యక్షుడు పీవీఎస్ కృష్ణారావు, అల్లు బాబి, డాక్టర్ కంటే వీరన్న చౌదరి, లయన్ గుబ్బల రాంబాబు, బళ్ల శ్రీనివాసరావు, జీవీ రమణ, పతివాడ రామరాజు, యరక కొండబాబు, ఆకుల రాంబాబు, కసిరెడ్డి రాంబాబు తదితరులు మాట్లాడుతూ కోరుకొండ ప్రభ నిర్విరామంగా 116 పాటలు పాడడాన్ని అభినందించారు. ప్రభ దేవుడు చిత్రంలో మహా కనకదుర్గ పల్లవితో మొదటి పాటను ప్రారంభించి, చిన్నికృష్ణుడు చిత్రంలోని జీవితం సప్తస్వరాల వేదం పాటతో ముగించారు. ఈ సందర్భంగా వివిధ సంస్థల నిర్వాహకులు, గాయనీ గాయకులు కోరుకొండ ప్రభను ఘనంగా సత్కరించారు.

ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు


72 పరుగులు చేసిన తూర్పుగోదావరి జిల్లా బ్యాట్స్‌మన్ కార్తీక్

కడప స్పోర్ట్స్: కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 క్రికెట్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. వైఎస్సార్‌ఆర్-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెండోరోజు ఆదివారం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 51.5 ఓవర్లలో 122 పరుగుల వద్ద ఆలౌట్ అయ్యింది. జట్టులోని నిశాంత్‌రెడ్డి 21, రుత్విక్ కల్యాణ్ 45 పరుగులు చేశారు. పశ్చిమగోదావరి బౌలర్లు జితేష్ సాయివల్లభన్ 2, కార్తీక్‌వర్మ 2, పి.నారాయణ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పశ్చిమ గోదావరి జట్టు 57.4 ఓవర్లలో 152 పరుగుల వద్ద ఆలౌట్ అయ్యింది. జట్టులోని పి.నారాయణ 67 పరుగులు, సూర్యసాయిమణికంఠ 25 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లు వివేక్ 4, జగదీష్ 2, వెంకటకార్తీక్ 2 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో పశ్చిమగోదావరి జట్టు 98 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో కర్నూలు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

తూర్పు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 112 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన తూర్పుగోదావరి జట్టు మరో 11 పరుగులు చేసి 123 పరుగుల వద్ద ఆలౌట్ అయ్యిది. ప్రకాశం బౌలర్ దినేష్ 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 53.3 ఓవర్లలో 115 పరుగుల వద్ద ఆలౌట్ అయ్యింది. జట్టులోని రాజ్‌మోహన్ 55 పరుగులు చేశాడు. తూర్పుగోదావరి బౌలర్లు కార్తీక్ 4, ఎస్.సైద్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తూర్పుగోదావరి జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 32 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 111 పరుగులు చేసింది. జట్టులోని కార్తీక్ 72 పరుగులు చేశాడు. ప్రకాశం బౌలర్ దినేష్ 2 వికెట్లు తీశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. తూర్పుగోదావరి జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

26 నుంచి ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఒక రోజు ఆధ్యాత్మిక ప్రయాణ పర్యాటక ప్యాకేజీని ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభించనున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శాసనసభలో పలువురు ఎమ్మెల్యేల సూచనల మేరకు వారాంతంలో ఉమ్మడి తూర్పు గోదావరిలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలు, పంచారామ క్షేత్రాలను కలిపేలా ఒక రోజు టూర్ ప్యాకేజీకి ప్రణాళిక రూపొందించామన్నారు. స్థానికంగా మంత్రి దుర్గేష్ టూర్ ప్యాకేజీ వివరాలను వివరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలుత అత్యంత ప్రసిద్ధి చెందిన కోరుకొండ నరసింహస్వామి దేవస్థానం, అనంతరం అన్నవరం శ్రీవీర వెంకట సత్యనారాయణ స్వామి, పిఠాపురం కుక్కుటేశ్వర స్వామి ఆలయాలు, సామర్లకోటలోని శ్రీచాళుక్య కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయాన్ని యాత్రికులు దర్శించుకుంటారని తెలిపారు. సామర్లకోట దేవాలయంలో మధ్యాహ్నం అన్న ప్రసాదాలు స్వీకరించిన అనంతరం ద్రాక్షారామలోని భీమేశ్వరస్వామి ఆలయాన్ని యాత్రికులు సందర్శిస్తారని తెలిపారు. వాడపల్లి వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని యాత్రికులు సందర్శించేలా ఒకరోజు టూర్ ప్యాకేజీని నిర్ణయించామని మంత్రి దుర్గేష్ అన్నారు. ఈ నెల 26 నుంచి బస్సులు పర్యాటకులకు అందుబాటులోకి రానున్నాయని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరంలోని సరస్వతీ ఘాట్ వద్ద పర్యాటక శాఖకు సంబంధించిన ఇన్ఫర్మేషన్ అండ్ రిజర్వేషన్ కౌంటర్ కార్యాలయం (ఐఆర్‌ఓ) వద్ద ప్రతి శనివారం ఉదయం 6 గంటలకు బయలుదేరే పర్యాటకుల బస్సు కోరుకొండ, అన్నవరం, పిఠాపురం, సామర్లకోట, ద్రాక్షారామ, వాడపల్లి ఆలయాల మీదుగా రాత్రి 7 గంటలకు రాజమహేంద్రవరంలోని హేవలాక్ బ్రిడ్జి దగ్గర పుష్కర్ ఘాట్‌కు చేరుకుంటుందన్నారు. పెద్దలకు రూ.వెయ్యి, 3–10 ఏళ్లలోపు చిన్నారులకు రూ.800 టూర్ చార్జీగా నిర్ణయించామన్నారు.